క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల నిరసన

ఆదిలాబాద్: ఆర్టీసీ యూనియన్ నాయకులు బుధవారం ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా యూనియన్ రీజియన్ అధ్యక్షుడు సర్పే భీంరావు మాట్లాడుతూ.. జాతీయ కోరికల దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపో ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, ఊషన్న పాల్గొన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో వ్యక్తి మృతి


బాపయ్య (ఫైల్)

జైనథ్: మండలంలోని నిరాల గ్రామానికి చెందిన రామగిరి బాపయ్య బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందాడు. రియల్ ఎస్టేట్ రంగంలో పని చేస్తున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల అధిక రక్తపోటుతో బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో ఆదిలాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆర్థిక పరిస్థితిని గమనించిన యజమానులు అశోక్‌పటేల్, రమేశ్‌శర్మ దాదాపు రూ.3లక్షలు ఖర్చు చేసి చికిత్స అందేలా చూశారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాపయ్య మృతిచెందాడు. ఆయనకు భార్య నర్మద, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రతి ఇంటికీ విద్యుత్ మీటరు ఉండాలి

ఇచ్చోడ: గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రతీ ఇంటికీ విద్యుత్ మీటర్ కనెక్షన్ కలిగి ఉండాలని విద్యుత్ విజిలెన్స్ సీఐ ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని ముఖరా(కె)లో విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం 2 వందల యూనిట్ల లోపు విద్యుత్ వాడితే వారికి గృహజ్యోతి పథకం వర్తింప చేస్తుందన్నారు. సమావేశంలో విజిలెన్స్ ఏడీ విజయసారథి, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీ నగేశ్‌ను కలిసిన నాయకులు

ఇచ్చోడ: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను బుధవారం ఇచ్చోడ మండల బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఇటీవల గెలుపొందిన తర్వాత ఢిల్లీ నుంచి ఆదిలాబాద్‌కు వచ్చిన సందర్భంగా కలిసినట్లు నాయకులు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ సోన్‌కాంబ్లే కృష్ణాకుమార్, నరాల శ్రీనివాస్, పెండుర్ తుల్సిరాం, కుసల్‌చంద్, తదితరులు ఉన్నారు.

రాజుల్‌వాడీలో వైద్యశిబిరం

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామపంచాయతీ పరిధిలోని రాజుల్‌వాడీ గ్రామంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సాహితి సిబ్బందితో కలిసి గ్రామస్తులకు వివిధ వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటి పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుజా త, కార్యదర్శి నితిన్, అంగన్‌వాడీ కార్యకర్త మనీషా, తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో ఎదగాలి

బోథ్: అన్ని రంగాల్లో మున్నూరుకాపులు ఎదగాలని ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ మంత్రి జోగు రామన్నలు అన్నారు. సొనాల గ్రామంలో రూ.కోటి 20 లక్షలతో నిర్మించిన మున్నూరుకాపు సంఘం భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మున్నూర్‌కాపులు మరింత బలపడాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, రైల్వేబోర్డు సభ్యులు జీవీరమణ, మాజీ జెడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, సుధాకర్, సజన్‌లాల్ పాల్గొన్నారు.

సన్మానం

గుడిహత్నూర్: మండలంలో మన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు ఇన్‌చార్జి ఎంఈవో ఆర్.నారాయణ, ఉపాధ్యాయులు ప్రమోద్, సంజయ్, సతీష్, రమణ, పోశెట్టిలను పాఠశాల సిబ్బంది బుధవారం సన్మానించారు.

బోథ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ బాలుర పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

నేరడిగొండ: మండలంలోని వాంకిడి పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు సన్మానించారు. ధనలక్ష్మి, అమిత, తానాజీలకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఉపాధ్యాయులు వెంకటరమణా రెడ్డి, వివేక్, భవాని, అనంద్ కుమార్, మాధవీలతను సన్మానించారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పదోన్నతిపై ఇతర పాఠశాలకు వెళ్తున్న రత్నప్రభ, సీహెచ్ విలాస్, సీహెచ్, సుజాత, రాజీమోహన్ ఉపాధ్యాయులను విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం వీడ్కోలు పలికారు.

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు శ్రీరాం, ప్రహ్లద్, బ్రాంచ్ పోస్టుమాస్టర్ బూస పోశాలను పాఠశాల ఆవరణలో గ్రామస్తులు సన్మానించారు.

రెండున్నరేళ్లుగా నిరీక్షణ

- విద్యార్థులకు అందని ట్రాన్స్‌పోర్టు చార్జీలు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు


పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: గ్రామంలో ఉన్నత పాఠశాల లేకపోతే ఇతర గ్రామానికి వెళ్లి ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఆయా విద్యా సంవత్సరంలో ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు అందజేస్తోంది. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలకు సంబంధించి నిధులు రెండున్నరేళ్లుగా విడుదల కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా.. మండలంలో 87 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆయా ప్రభుత్వ పాఠశాలలో ఒక గ్రామం నుంచి మరొగ్రామానికి వాహనాల్లో తరలివెళ్లి చదువుకునే వారికి నెలకు రూ. 300 అందజేస్తారు.

మండలంలో 301 మంది..

గ్రామం నుంచి 3 కిలో మీటర్ల దూరం వెళ్లి ఇతర పాఠశాలలో చదువుకునే వారు ఆదిలాబాద్ రూరల్ మండలంలో 301 మంది విద్యార్థులు ఉన్నారు. వారు ట్రాన్స్‌పోర్ట్ చార్జీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2022- 23, 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు విడుదల కాలేదు. అసలు ఆ నిధులు ఇస్తారో? లేదో? తెలియని పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 1.80 లక్షలు పెండింగ్

విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో చదువులు మానేయకుండా ఉండేందుకు ఉన్నత చదువులు చదువాలనే ఉద్దేశంతో గ్రామానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు నెలకు ప్రభుత్వం రూ. 300 చొప్పున ఒక్కొక్కరికి ట్రాన్స్‌పోర్ట్ చార్జీ అందజేస్తోంది. రెండు విద్యా సంవత్సరాలు కలిపి మొత్తం సుమారు రూ. 1.80 లక్షల వరకు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఎప్పుడు ఇస్తారోనని ఎదురు చూస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



"విద్యార్థులు వాహనాలలో వెళ్లేందుకు ప్రభుత్వం నెలకు రూ. 300 చొప్పున ట్రాన్స్‌పోర్ట్ చార్జీని అందజేస్తోంది. రెండేళ్ల ట్రాన్స్‌పోర్టింగ్ చార్జీలకు సంబంధించి నిధులు విడుదలకు ప్రతిపాదనలు పంపించాం. ఆనిధులు నేరుగా విద్యార్థి ఖాతాలో జమ అవుతాయి."

– జయశీల, ఎంఈవో, ఆదిలాబాద్ రూరల్

నాటిన మొక్కలు సంరక్షించాలి


వనమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు. చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని, అందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. చెట్లు పెంచి పర్యావరణ సమతుల్యతలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, రవీందర్ రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, ఎఫ్ఆర్‌వో గణేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎండీ సద్దాం, పశువైద్యాధికారి సుశీల్ కుమార్, ఏపీవో వసంత్‌రావు, ఐకేపీ ఏపీఎం ఉత్తమ్, ఎంపీవో లక్ష్మణ్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎల్‌టీలను నియమించవద్దు


రిమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎల్‌టీలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయవద్దని ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్‌లు అన్నారు. బుధవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిమ్స్ ప్రారంభం నుంచి 19 మంది ల్యాబ్ టెక్నీషియన్లు పని చేస్తున్నామన్నారు. గత 16 ఏళ్లుగా పని చేస్తున్నామని, తాము పని చేస్తున్న పోస్టుల్లో రెగ్యులర్ ఎల్‌టీ పోస్టులను భర్తీ చేయవద్దని హైకోర్టు ఆదేశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్‌టీలు సతీశ్, నర్సారెడ్డి, శైలేందర్, నగేశ్, దినేశ్, తిలక్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి


వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని పిట్టబొంగరం గ్రామపంచాయతీ పరిధిలోని పాటగూడ ఏకలవ్య గురుకులం పాఠశాలలో నెలకొన్న నీటి సమస్య వెంటనే పరిష్కరించాలని మాజీ ఎంపీపీ పోటే శోభాబాయి, మాజీ జెడ్పీటీసీ ఆర్క పుష్పలతలు అన్నారు. బుధవారం మండలంలోని ఏకలవ్య గురుకులం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, పాఠశాల నిర్వాహకులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని మూడు గ్రామ పంచాయతీలలో 2023– 24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులపై బుధవారం మావల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ. 95,57,444 విలువ చేసే పనులు చేపట్టారు. ఇందులో రూ. 93,68,526 కూలీలకు కేటాయించగా.. రూ. 1,42,238 మెటీరియల్‌కు కేటాయించారు. తనిఖీకి అడిషనల్ డీఆర్‌డీవో కుటుంబరావ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయా గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజలింగు, ఎస్టీఎం వేణు, ఎస్‌ఆర్‌పీ ప్రదీప్ కుమార్, ఎంపీడీవో శంకర్, ఈజీఎస్ ఏపీవో రజిని పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వీఆర్‌ఏల వారసులు


వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల వారసులు

నేరడిగొండ: వీఆర్‌ఏల వారసులకు నియామక ఉత్తర్వులు అందజేసేలా చూడాలని వీఆర్‌ఏల వారసులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నం.81 ప్రకారం 3,797 మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు త్వరితగతిన నియామక ఉత్తర్వులు అందజేసేలా అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని తప్పకుండా అసెంబ్లీలో ప్రశ్నిస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు జీరో అకౌంట్స్ ఇవ్వాలి


వినతిపత్రం అందస్తున్న వరప్రసాదరావు

ఆదిలాబాద్: ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో చేరే విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ ద్వారా జీరో అకౌంట్స్ ఇవ్వాలని తెలంగాణ కోఆపరేటివ్ బ్యాంక్ రాష్ట్ర చైర్మన్ మారినేని రవీందర్రావును తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కాలేజ్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీఎంఏ) సభ్యుడు వేముగంటి వరప్రసాదరావు కోరారు. వరంగల్ జిల్లా కేంద్రంలో బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ.. విద్యార్థుల ఉపకార వేతనాల కోసం జీరో అకౌంట్స్ ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

ఎదులాపురం: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2లో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ గురించి విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా ప్రయోగాత్మకంగా ప్రదర్శించడం, పాఠ్యాంశాల్లోని బోధనలను అగస్త్య ఫౌండేషన్ త్రీడి మోడల్స్‌లో చూపించడం అభినందనీయమన్నారు. ఇందులో ఫౌండేషన్ ప్రతిని ధులు నవీన్, సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్, ఏఎస్ వో మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోరింటాకు పండుగ



తాంసి మండలంలోని కప్పర్ల రామాలయంలో బుధవారం మహిళలు గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆలయ మండపంలో గ్రామానికి చెందిన పలువురు మహిళలు అమ్మవారిని ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోరింటాకు రుబ్బి, ఒకరికొకరూ పెట్టుకొని మురిసిపోయారు. కార్యక్రమంలో మహిళలు లక్ష్మి, సరోజ, విజయ పాల్గొన్నారు. – తాంసి

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఆడె గజేందర్

బోథ్: బోథ్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ. 30 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. సాయినగర్ కాలనీలో రూ. 5 లక్షలతో వంతెన నిర్మాణం, 14, 15వ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, గొర్ల రాజు, చంటి, ప్రఫుల్ చందర్ రెడ్డి, కుర్మె మహేందర్, చట్ల ఉమేష్, షేక్ నాజర్, రాజు రెడ్డి, పోతన్న, భోజన్న, గంగాధర్, షాకీర్, హఫీస్, యూసుఫ్, సాయి పాల్గొన్నారు.

సికిల్‌సెల్ శిబిరం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ఖండాల గ్రామపంచాతీలో బుధవారం సికిల్‌సెల్ శిబిరం నిర్వహించారు. అందులో భాగంగానే ఆభాకార్డ్, ఇమ్యునైజేషన్ టీకాలు వేయడం, మెడికల్ క్యాంపు నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటి పరిసరా ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు బొమ్మెత సుభాష్, ఎంఎల్‌హెచ్‌పీ మోహిజొద్దీన్, ఆరోగ్య కార్యకర్త రాథోడ్ చంద్రకళ పాల్గొన్నారు.

వానాకాలంలో జాగ్రత్తలు పాటించాలి


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జైనథ్: ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జైనథ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు నైనత సూచించారు. బుధవారం మండలంలోని బెల్గాం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వానాకాలంలో వచ్చే రోగాలను నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే ఆసుపత్రిలో సంప్రదించాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు చేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వలన చాలా వరకు రోగాలు దరిచేరవన్నారు.

నేడు ఇచ్చోడలో జాబ్‌మేళా

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో గురువారం నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నిఖినవర్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన నాలుగు ప్రముఖ కంపెనీల ద్వారా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: నూతన విద్యుత్‌సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని మండలంలోని కుమారి గ్రామస్తులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

‘ధర్నా విజయవంతం చేయండి’



మాట్లాడుతున్న వెంకట్ నారాయణ

ఎదులాపురం: బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఈనెల 15న ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ అనుబంధం) జిల్లా నాయకులు వెంకట్ నారాయణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కుమరంభీం భవన్‌లో బుధవారం మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా.. మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు ప్రభుత్వం చేయూత పథకం కింద రూ.4 వేలు బీడీ కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా అందించాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, కార్మికులందరికీ రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు గంగమ్మ, తారాబాయి, గణేశ్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కుటుంబాలను ఆదుకుంటాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్‌రూరల్: కడెం మండలంలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ పునరావాస మైసంపేట, కొత్తమద్దిపడగ, రాంపూర్ గ్రామస్తులను ఆదుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలు విన్నవించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ పునావాస కుటుంబాలకు ఆప్షన్2 ప్రకారం అందాల్సిన వ్యవసాయ యోగ్యమైన భూములకు పట్టాలు వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ లబ్ధిదారుడికి వ్యవసాయ పట్టాలు, బావి, విద్యుత్ కనెక్షన్,, నీటి పంపులు వెంటనే ఏర్పాటు చేయిస్తామన్నారు. సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి సమస్యలను త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. గ్రామస్తులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణకు గురువారం ఉదయం 10గం.లకు ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా వ్యాప్తంగా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పథకంపై అభిప్రాయాలను తెలపాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. బుధవారం మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యూం, ఎస్పీ రెడ్డి, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెట్లే జీవకోటికి ప్రాణాధారం


మొక్కలు నాటుతున్న డీఎల్‌పీవో ఫణీంధర్

సిరికొండ: చెట్లే జీవకోటికి ప్రాణాధారమని డీఎల్‌పీవో ఫణీంధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించే చర్యలు ఉపాధి సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు చేపట్టాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్ కుమార్, ఉపాధి ఏపీవో భీంరావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

బోథ్: విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ఐటీకోర్ డీఎస్పీ హసివుల్లా, బోథ్ సీఐ రమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో జిల్లా షీటీం ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ వాడకం, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై రాము, విద్యార్థినులు, షీటీం కానిస్టేబుల్‌లు రియాజ్, సుశీల, సత్యమోహన్ పాల్గొన్నారు.

ఐక్యవేదిక నిర్మిస్తాం..

ఎదులాపురం: ఆదిలాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధికి రాజకీయ పార్టీలు, సామాజిక ప్రజాసంఘాలు, మేధావులతో ఐక్యవేదిక నిర్మించి పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్ అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర విస్తృత సమావేశంలో జిల్లా ప్రతినిధిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో దర్శనాల మల్లేశ్, లంకా రాఘవులు, పూసం సచిన్, భీంరావు పాల్గొన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి

ఎదులాపురం: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దయాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ఇకనైనా కాలయాపన చేయడం మానుకుని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. జోగు రవి, రైతులు మల్లన్న, నాగరావు, రాజన్న, ముకుంద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ దండె విఠల్‌ను కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించారు. గ్రామానికి రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్, పోతన్న, లోలపు పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.